క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగించుకోండి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పి.ఆర్.ఎస్.ఐ ప్రతినిధులు

మల్కాపురం : ఓటు చాలా విలువైనదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఏయూ పరీక్షా విభాగాల డీన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి అన్నారు. భారత ప్రజాసంబంధాల సంఘం (పి.ఆర్.ఎస్.ఐ) ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ 1962 సంవత్సరంలో దేశ జనాభాలో 21.63 కోట్ల మంది ఓటింగ్‌లో పాల్గొనగా నేడు ఆ సంఖ్య 94.5 కోట్లకు చేరిందన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం వేల కోట్ల రూపాయాలు ఖర్చు చేస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో సరైన పాలకును ఎన్నుకొనేందుకు ఓటును వినియోగించాలన్నారు. కార్యక్రమంలో పి.ఆర్.ఎస్.ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.ఎల్.కె.మూర్తి, దక్షిణ భారత ఉపాధ్యాక్షుడు యు.ఎస్.శర్మ, విశాఖ అధ్యక్షుడు ఎమ్.కె.వి.ఎల్.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం

మల్కాపురం : ఐఎన్‌టీయూసీ 78వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటక్ అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ పాల్గొని యూనియన్ జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్మిక రంగానికి ఐఎన్‌టీయూసీ అందించిన సేవలను ఆయన వివరించారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఇంటక్ నాయకులు, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి, ఇంటక్ నాయకులు నర్సింగ్‌యాదవ్, తాతబాబు పాల్గొన్నారు.

బాలయ్య రోడ్డు షో అట్టర్ ఫ్లాప్



బాలకృష్ణ రోడ్డు షోకు కానరాని జనం

గోపాలపట్నం: ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం బంక్ వరకు సాగిన బాలకృష్ణ రోడ్డుషో అట్టర్ ఫ్లాప్ అయింది. జనాలు లేక వెలవెలబోయింది. రహదారులు ఖాళీగా కనిపించాయి. బాలకృష్ణ వస్తున్నాడని పలు వార్డుల నుంచి రూ.100 నుంచి రూ.300వరకు ఇచ్చి జనాల్ని తీసుకు వచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆ పార్టీ నేతలే వాపోతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు బాలయ్య సభలో ఉండాలని ఒప్పందం మేరకు డబ్బులిచ్చి జనసమీకరణ చేసినా జనం ఉండ లేదు. బాలయ్య ప్రసంగానికి విసుగెత్తిపోయిన మహిళలు ఎందుకొచ్చాంరా బాబూ అంటూ వెళ్లిపోయారు. గోపాలపట్నంలో గణబాబు ఇంటి వద్ద కావాలనే ట్రాఫిక్ సృష్టించి జనాలు ఎక్కువగా ఉన్నట్లు బిల్డప్ ఇవ్వడం నవ్వులపాలైంది.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

రాష్ట్రంలో 'ఫ్యాన్' ప్రభంజనం ఖాయం



సూర్యానగర్‌లో ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఆశీస్సులు అందజేస్తున్న ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు



ఖర్వేల్‌నగర్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్
- 89వ వార్డులో విస్తృత ప్రచారం

గోపాలపట్నం: రాష్ట్రంలో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని, వైఎస్సార్‌సీపీకి ఓటెయ్యానికి ప్రజలు ఇప్పటికే ఫిక్స్ అయ్యారని ఆ పార్టీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 89వ వార్డు సూర్యానగర్, ఖార్వేల్‌నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రచారం చేశారు. ప్రజలు ఘనంగా హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టోను జనం నమ్మడం లేదన్నారు. అవన్నీ అబద్ధాల పుట్టని జనం తీర్మానించారు. 2014లో ఇచ్చిన మేనిఫెస్టో నెరవేర్చలేక వారి వెబ్‌సైట్‌నుంచే మాయం చేసిన విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. 600 హామీల్లో ఏ ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తరువాత మేనిఫెస్టోకి ఒక విలువ కల్పించారని తెలిపారు. ఆయన చెబితే చేస్తాడని నమ్మకం కల్పించారన్నారు. అందుకే వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై ప్రజలకు పూర్తి విశ్వాసమని తెలిపారు. చంద్రబాబు అమలు హామీలన్నీ మేనిఫెస్టోలో చేర్చి ప్రజలు మోసగించేందుకు కూటమితో వస్తున్నాడని, కూటమిని బంగాళాఖాతంలో కలిపేయాలని ఆడారి పిలుపునిచ్చారు. పశ్చిమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని, మెజార్టీ కోసమే ప్రయత్నిస్తున్నామన్నారు. తొలుత ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దల ఆశీసులు అందుకున్నారు. అనంతరం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, నగర కార్యదర్శి మళ్ల శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ అయితంశెట్టి కోటేశ్వరరావు, ఎన్నికల పరిశీలకురాలు పేడాడ రమణ కుమారి పాల్గొన్నారు.

గణబాబూ.. ఏంటీ రుబాబు

- వ్యాపారులు, బిల్డర్లకు బెదిరింపులు
- సహించేది లేదని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ హెచ్చరిక
- గూండాలా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోం
- ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామన్న అల్లా కృష్ణ
- ఎవరూ భయపడొద్దని భరోసా
- ఆడారి ఆనంద్ పోటీ చేస్తుండడంతో టీడీపీ ఎమ్మెల్యే గణబాబుకు ఓటమి భయం



మాట్లాడుతున్న జియ్యాని శ్రీధర్, బీఎస్ కృష్ణ

గోపాలపట్నం: వ్యాపారులను, బిల్డర్లను టీడీపీ ఎమ్మెల్యే గణబాబు బెదిరిస్తున్నారని, లక్షల్లో విరాళాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ (అల్లాకృష్ణ) ఆరోపించారు. మర్రిపాలెం వుడా లే అవుట్‌లో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. వీరు మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా ప్రచారాలు చేసుకోవాలని గూండాల్లా వ్యవహరించకూడదని హెచ్చరించారు. ఎమ్మెల్యేగా ఉన్న మీరు కరోనా సమయంలో ఎవరికైనా సాయపడ్డారా అని గణబాబును ప్రశ్నించారు. ఇంటి గేటుకు తాళం వేసి ఎటో వెళ్లిపోయారని, తానిక్కడ లేనని ఎవరూ రావద్దని బోర్డు పెట్టిన విషయాన్ని ప్రస్తావించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన ఆడారి ఆనంద్‌కుమార్ 18 నెలల్లో నియోజకవర్గంలో రూ.265 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. అంతే కాకుండా నెలకు రూ15 నుంచి 20లక్షలు వెచ్చించి పింఛన్లు అందించారని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచేది నేనే..వచ్చేది మా ప్రభుత్వమే.. తాను మంత్రి కావడం ఖాయం అంటూ వ్యాపారులు, బిల్డర్ల నుంచి రూ.10 నుంచి రూ20 లక్షలు డిమాండ్ చేస్తున్న గణబాబు ఆటలు ఇక సాగవన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ మాట్లాడుతూ ఓటమి భయంతో టీడీపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు వ్యాపారులను, బిల్డర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. అందులో తాను కూడా ఓ బాధితుడినేనన్నారు. వ్యాపారులను బెదిరిస్తున్నట్టు ఆధారాలు ఉన్నాయని, ఆధారాలు చూపిస్తే..గణబాబు పోటీ నుంచి తప్పుకుంటారా..అని ప్రశ్నించారు. గణబాబుకు ఓటమి భయం పట్టుకుందన్న విషయం స్పష్టమవుతుండడంతో అడ్డదారుల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. మహిళలకు కాసులపేర్లు, ఉంగరాలు, నగదు వంటి తాయిలాలు ఇచ్చి ప్రలోభాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పదేళ్లలో టీడీపీ హయాంలో గణబాబు చేసిన అభివృద్ధి ఏంటో..కేవలం 18 నెలల్లో ఆడారి ఆనంద్‌కుమార్ చేసిన అభివృద్ధి ఏంటో చర్చించేందుకు తాము సిద్ధమని సవాల్ చేశారు. టీడీపీ గూండాలు పశ్చిమ నియోజకవర్గంలో దౌర్జన్యాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

మీ ఆత్మీయుడు ఆడారిని ఆదరించండి



59వ వార్డులో ప్రచారం చేస్తున్న రమాకుమారి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ గెలుపు కోరుతూ డోర్ టూ డోర్ ప్రచారాన్ని నిర్వహించారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్ ఆధ్వర్యంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి విస్తృతంగా ప్రచారం చేశారు. ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్తగా నియమితులైన తరువాత ఆడారి ఆనంద్‌కుమార్ 19 నెలల కాలంగా కోట్లాది రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన విషయం అందిరికీ తెలిసిందేనన్నారు. మీ వాడిగా..మీలో ఒకడిగా ఆడారి ఆనంద్ అందరికీ ఆత్మీయుడయ్యాడని, అటువంటి వ్యక్తిని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే అంతా మంచే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇండ్రస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే 61వ వార్డు మల్కాపురం పరిధిలో జరిగిన డోర్ టూ డోర్ ప్రచార కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కోణతాల సుధ పాల్గొన్నారు. ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు చట్టి నూకరాజుయాదవ్, ఋూస అప్పలరెడ్డి, సన్నియాదవ్, మంగ పాల్గొన్నారు. 58వ వార్డు పరిధి పిలకవానిపాలెంలో పార్టీ నాయకురాలు చుక్క వరలక్ష్మి ఆధ్వర్యంలో డోర్ టూ డోర్ ప్రచారాన్ని నిర్వహించారు.

బాధితుడికి సాయం

మల్కాపురం : మల్కాపురం గాంధీజీవీధికి చెందిన చింతపల్లి రాజశేఖర్ అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. స్పందించిన గాంధీజీవీధి శ్రీ వినాయక సేవా సంఘం ప్రతినిధులు ఆ సంఘం నుంచి కొంత విరాళాలను సేకరించి రాజశేఖర్‌కు అందజేశారు.

అభివృద్ధి చూసి ఓటెయ్యండి



వెంకటాపురంలో మహిళలతో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద అంటే అక్కున చేర్చుకొనే నాయకుడు ఆడారి ఆనంద్‌కుమార్ అని తెలిపారు. కోట్లాది రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడన్నారు. అటువంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే మరింత అభివృద్ధి సాధ్యమన్నారు. విశాఖ సమస్యలను పార్లమెంట్ గళమెత్తే సమర్థత ఉన్న ఎంపీ అభ్యర్థి బొత్సఝాన్సీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో గృహసారథులు, కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



62వ వార్డు త్రినాథపురంలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు



62వ వార్డు దుర్గానగర్ సచివాలయంలో...

సింధియా: ప్రజలకు సేవ చేస్తుంటే తమపై ప్రతిపక్ష పార్టీలు నిందలు వేసి అసత్య ప్రచారాలను చేస్తున్నారని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం, దుర్గానగర్ సచివాలయం పరిధిలోని సుమారు 20 మంది వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిస్వార్థంగా అందిస్తుంటే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బీజేపీనాయకులు తమపై లేనిపోని నిందలు వేస్తున్నారని, పెన్షన్లు ఇవ్వకుండా తమను అడ్డుకోవడం చాలా బాధనిపించందని తెలిపారు. తమ దగ్గరున్నంచి మొబైల్ సిమ్‌లు, వేలిముద్ర మిషన్లు తీసేసుకున్నారని ఆవేదన చెందారు. తమను ఎన్నో రకాలుగా అవమానించినా భరించామని, పేదలకు అందించే సంక్షేమ పథకాలను అందివ్వకుండా అడ్డుకోవడం బాధాకరమన్నారు.

దేశానికే ఆదర్శంగా జగన్ పాలన



62వ వార్డు త్రిరాథపురంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా : పారదర్శకత సంక్షేమ పథకాలు అందజేసిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జీవీఎంసీ 62వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు బల్ల లక్ష్మణరావు అన్నారు. సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేరేలా పాలన అందించిన జగన్‌ను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. శుక్రవారం 62వ వార్డు పరిధి త్రినాథపురంలో పోలింగ్‌బూత్ నంబర్ 142, 143, 144 పరిధిలో గడపగడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్, సచివాలయ కన్వీనర్లు ఎస్.సత్యనారాయణ, చంటి, నాయకులు మధు, కనకరావు, గృహసారథులు, ఆయా పోలింగ్ బూత్‌ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్ కుమార్ గెలుపుతోనే అభివృద్ధి

- డిప్యూటీ మేయర్ శ్రీధర్
- 52వ వార్డులో ఇంటింటి ప్రచారం



వుడా లే అవుట్ కాలనీలో ప్రచారం చేస్తున్న శ్రీధర్, అల్లా కృష్ణ



ఓటు అభ్యర్థిస్తున్న శ్రీధర్, అల్లా కృష్ణ



మర్రిపాలెం వుడా లే అవుట్‌లో ఇంటింటి ప్రచారంలో శ్రీధర్

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, బొత్స ఝాన్సీ గెలవాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, విశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లా కృష్ణ అన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ 52వ వార్డు పరిధిలోని మర్రిపాలెం వుడా లే అవుట్ కాలనీలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాలనీలోని వినాయకుడి గుడి నుంచి పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, బీఎల్ఏలు, వార్డు స్థాయి నాయకులు,మహిళా నాయకులతో కలసి కాలనీలోని అన్ని వీధుల్లో విస్తృతంగా పర్యటించారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లే వారితో కలసి కొద్దిసేపు నడిచి, ఆనంద్ కుమార్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం కాలనీలోని ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పశ్చిమ నియోజకవర్గంలో ఈసారి వైఎస్సార్ సీపీ గెలవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. కోట్లాది రూపాయలతో రహదారులు, పార్కులను అభివృద్ధి చేశామన్నారు. ఐదేళ్ల కాలంలో ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలను అందించామన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే గెలిస్తే, ప్రభుత్వపరంగా మరిన్ని నిధులు తీసుకొచ్చి కాలనీలను సర్వతోముఖాభివృద్ధి చేస్తారన్నారు. టీడీపీ నాయకుల ప్రలోభాలకు ఎవ్వరూ లొంగవద్దని, వారి బెదిరింపులకు కూడా తలొగ్గాల్సిన అవసరం లేదని, వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఈసారి పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలన్నారు. ఎమ్మెల్యేగా ఆనంద్ కుమార్, ఎంపీగా బొత్స ఝాన్సీలను గెలిపించేలా ప్రతీ ఒక్కరూ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు. వార్డుల పరిధిలో ఎలాంటి సమస్య ఎదురైనా పరిష్కరించేందుకు తాముల అన్ని వేళలా అందుబాటులోనే ఉంటామన్నారు. కార్యక్రమంలో 52వ వార్డు అధ్యక్షుడు జియ్యాని మారుతీ, జీ. రామకృష్ణ, జియ్యాని విజయ్ కుమార్, మహిళా నాయకురాలు శ్రీదేవి వర్మ, వుడా లే అవుట్ కాలనీ అసోసియేషన్ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసే జగనన్నను గెలిపిద్దాం

- పశ్చిమలో వైఎస్సార్‌సీపీ జెండాఎగరేద్దాం
- ఆడారి సతీమణి మాలతి ప్రచారం



ఎన్నికల ప్రచారంలో ఆడారి సతీమణి మాలతి

కంచరపాలెం: మీ ఇంటికి మంచి జరిగితే జగనన్న ప్రభుత్వానికి ఓటు వేయాలని ఆడారి మాలతి కోరారు. జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం 183, 184 పరిధిలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతుగా శుక్రవారం 52,56,57 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆడారి ఆనంద్‌కుమార్ సతీమణి ఆడారి మాలతి, పార్టీ నేత బుద్దా సుజాత ప్రతి గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలతో కొద్ది సేపు ముచ్చటించారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆడారికి మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతి ఇంటా ప్రజలు హారతులు పట్టి ఆడారి మాలతికి ఆహ్వానం పలికారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో కరపత్రాన్ని ప్రతి గడపకు అందించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు సర్వసిద్ధి సాయిలత, నమ్మి శశికుమార్, ఎం.రాజ్యం, వై.రాజు, నమ్మి లీలావతి, ఎం.శ్రావణి, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి శిష్టకరణాల సంపూర్ణ మద్దతు



వైవీ సుబ్బారెడ్డిని సత్కరించి, మద్దతు తెలుపుతున్న అనూష పట్నాయక్ తదితరులు

మధురవాడ: రానున్న ఎన్నికల్లో శిష్టకరణాలు అంతా వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు రాష్ట్ర శిష్టకరణాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.అనూష పట్నాయక్, ఏపీ శిష్టకరణ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్‌కే మహంతి తెలిపారు. మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి నివాసంలో ఆయనను, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. భీమిలి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తుందన్నారు. త్వరలోనే ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి అందరి సమక్షంలోనే వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతామన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శిష్టకరణ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఉమా మహేశ్వరరావు, కాపు నాయకులు తోట రాజీవ్, శిష్టకరణ అసోసియేషన్ నాయకులు గోపాలరావు, ఆదిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్-బ్రహ్మపూర్ మధ్య సమ్మర్ స్పెషల్స్

తాటిచెట్లపాలెం: వేసవి రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్-బ్రహ్మపూర్-సికింద్రాబాద్ మధ్య పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమ్మర్ స్పెషల్ రైళ్ల వివరాలిలా.. : సికింద్రాబాద్-బ్రహ్మపూర్(07035) రైలు ఈ నెల 11, 14 తేదీల్లో రాత్రి 8.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.33 గంటలకు దువ్వాడ చేరుకుని, తిరిగి 9.38 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. ◆ తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-సికింద్రాబాద్(07036) రైలు ఈ నెల 12, 15 తేదీల్లో సాయంత్రం 4.45 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.55 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ◆ సికింద్రాబాద్-బ్రహ్మపూర్(07027) స్పెషల్ రైలు ఈ నెల 10వ తేదీ రాత్రి 8.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.33 గంటలకు దువ్వాడ చేరుకుని, తిరిగి 9.38 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-సికింద్రాబాద్(07028) రైలు ఈ నెల 11న సాయంత్రం 4.45 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.55 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.